క్లుప్తంగా

విద్యార్థినికి ఆర్థిక సాయం

నరసరావుపేట ఈస్ట్: విద్యార్థినికి ఉన్నత చదువుల నిమిత్తం బొల్లు రాజేశ్వరి కృష్ణారావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.25వేలు ఆర్థిక సాయం ఆదివారం అందించారు. పట్టణానికి చెందిన ఎంవీఎస్ లలిత హరియాణాలో ఉన్నత చదువులు నిమిత్తం ఉన్నారు. ఆమె తండ్రి ఎంవీఎస్ రంగనాథ్‌కు ట్రస్ట్ చైర్మన్ బొల్లు వెంకటకృష్ణారావు, సభ్యులు బొల్లువెంకటేశ్వర్లు, మర్లపాటిరామకృష్ణ, జాస్తిగోపాలకృష్ణ ఆర్థికసాయం అందించారు.

చర్చి నిర్వహణకు ఆర్థికసాయం

నాదెండ్ల: మతాలన్నీ మంచినే బోధిస్తాయని, సాటి మనుషులను ఆదుకోవటం, సమాజాభివృద్ధికి దోహదపడటం ఉత్తమ మార్గమని జ్ఞానేశ్వర ఫౌండేషన్ ఛైర్మన్ షేక్ జాన్‌సైదా చెప్పారు. నాదెండ్ల మండలం, చిరుమామిళ్ల గ్రామంలోని కృపా మినిస్ట్రీస్ చర్చి నిర్వహణకు ఫౌండేషన్ తరపున రూ.15 వేల ఆర్థిక సాయాన్ని ఆదివారం అందించారు. మాజీ ఎంపీపీ కంజుల వీరారెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ జాలాది సుబ్బారావు, వైఎస్సార్ సీపీ నాయకులు గొంటు శ్రీనివాసరెడ్డి, మానుకొండ శేషిరెడ్డి, రత్నారెడ్డి, షేక్ అబ్దుల్‌రౌఫ్, జమ్మలమడక హరిబాబు ఉన్నారు.

విద్యార్థి అదృశ్యం

నరసరావుపేట టౌన్: విద్యార్థి అదృశ్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ అశోక్ ఆదివారం తెలిపారు. మండలంలోని చింతలపాలెం గ్రామానికి చెందిన మారెబోయిన అశోక్ కుమార్ పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. శనివారం ఇంటి నుంచి పాఠశాలకు వచ్చిన బాలుడు తిరిగి ఇంటికి రాలేదు. అతని కోసం గాలించినా ప్రయోజనం దక్కలేదు. ఈ మేరకు బాలుడి తండ్రి హరికృష్ణ ఇచ్చిన ఫిర్యాదుతో అదృశ్యం కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

బొడ్డురాయికి జలాభిషేకం

నాదెండ్ల: ఎండుగుంపాలెం గ్రామంలో కొలువైయున్న గ్రామ దేవత సీతాలంబతల్లి (బొడ్డురాయి) వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు బిందెలతో నీళ్లు మోసుకొచ్చి అమ్మవారికి జలాభిషేకం నిర్వహించారు. అమ్మవారికి కుంకుమ పూజలు, ఆకుపూజ నిర్వహించారు. తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం వచ్చే ఏడాది సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలతో గ్రామాలు కళకళలాడాలని మొక్కుకున్నారు. పొంగళ్లు పొంగించి నైవేద్యాలు సమర్పించారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి



నరసరావుపేట టౌన్: రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే ఎస్‌ఐ టి.సుబ్బారావు ఆదివారం తెలిపారు. నరసరావుపేట రైల్వే స్టేషన్ నుంచి మునమాక రైల్వే స్టేషన్ మార్గమధ్యంలో సుమారు 60 సంవత్సరాలు వయస్సు గల వ్యక్తి పట్టాలు దాటుతుండగా డోన్ నుంచి గుంటూరు వెళుతున్న రైలు ఢీకొంది. సంఘటనలో తీవ్రంగా గాయపడ్డ క్షతగాత్రుడు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడు గోధుమ రంగు నిండు చేతుల చొక్కా, తెలుపు రంగు పంచె ధరించి ఉన్నాడు. మృతుడి ఆనవాళ్లు తెలిసిన వారు రైల్వే పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్‌ఐ కోరారు.

రేపు సువర్చలావీరాంజనేయ కల్యాణం

నాదెండ్ల: గణపవరం–కావూరు డొంక రోడ్డులో కొలువైయున్న వీరాంజనేయస్వామి దేవస్థానంలో ఈ నెల 8వ తేదిన ప్రథమ వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయకమిటీ అధ్యక్షుడు కాట్రు శ్రీనివాసరావు తెలిపారు. ఈ నెల 7వ తేదీన సువర్చలా సమేత వీరాంజనేయ స్వామి కల్యాణోత్సవం జరుగుతుందన్నారు. అదేరోజు ఉదయం మంగళవాయిద్యాలతో సుప్రభాత సేవ, గణపతి పూజ, పుణ్యావచనం , పంచలోహ ఉత్సవ విగ్రహాలకు సంప్రోక్షణ జరుగుతాయన్నారు. 10 గంటలకు కల్యాణోత్సవం, సాయంత్రం ఉత్సవ మూర్తులకు గ్రామోత్సవం నిర్వహించనున్నారు. 8వ తేదీ మంగళవారం గణపతిపూజ, అభిషేకాలు, గోత్రనామ పూజల అనంతరం భారీ అన్నదానం నిర్వహించనున్నారు.

వైభవంగా వసంతోత్సవం

నాదెండ్ల: సాతులూరు గ్రామంలో కొలువైయున్న గ్రామ దేవతల ఆలయ వసంతోత్సవం ఆదివారం నిర్వహించారు. గత నెల 31న ప్రారంభమైన వేడుకలు ఆరో రోజు భక్తిశ్రద్ధలతో జరిగాయి. పోలేరమ్మ, మునిబందమ్మ, వినుకొండ అంకమ్మ ఊరఅంకమ్మ, మహాలక్ష్మమ్మ, నాభిశిలలకు భక్తులు సాంప్రదాయబద్ధ మేళతాళాలతో పూజలు నిర్వహించారు. ఆరో తేదిన పొంగళ్లు పొంగించి నైవేద్య సమర్పణ, భారీ అన్నదానం, ఏడున మొక్కుబడులు, 8న సిడిమానోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతిరోజు సాయంత్రం 9 గంటలకు ఆలయం వద్ద భజన కార్యక్రమాలు జరగనున్నాయి.

వైద్యశిబిరాల నిర్వహణ అభినందనీయం

ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి



వైద్యశిబిరాన్ని ప్రారంభించి, మందులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

రొంపిచర్ల: ఉచిత మెగా వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నరసరావుపేట శాసన సభ్యుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నరసరావుపేటకు చెందిన డాక్టర్ రామలింగారెడ్డి మ్యాక్సివిజన్ కంటి వైద్యశాల ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ వైద్యశిబిరాన్ని శాసనసభ్యుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరసరావుపేటలో పేరున్న ప్రముఖ కంటి వైద్యనిపుణుడు డాక్టర్ రామలింగారెడ్డి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించటం అభినందనీయమన్నారు. శిబిరానికి విచ్చేసిన ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డికి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, వైద్యసిబ్బంది ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు. ఈ వైద్యశిబిరంలో గ్రామంతో పాటు పరిసర గ్రామాలకు చెందిన 256 మందికి కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, కళ్లజోళ్లు పంపిణీ చేశారు. వారిలో 85 మందిని ఆపరేషన్ కేసులుగా గుర్తించారు. వారికి తమ హాస్పిటల్‌లో ఉచితంగా కంటి ఆపరేషన్లు చేస్తామని వైద్యులు తెలిపారు. అలాగే మూగజీవాలైన పశువుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని వాటికి అత్యవసర సేవలు అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ అంబులెన్స్‌ను ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమాలల్లో జెడ్పీటీసీ పిల్లి ఓబుల్‌రెడ్డి, మార్కెట్ యార్డు ఛైర్మన్ పచ్చవ రవీంద్రబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు చపారపు గోపాలరెడ్డి, అన్నెం పున్నారెడ్డి, గెల్లి బ్రహ్మరెడ్డి, గెల్లి సుబ్బారెడ్డి, మానుకొండ వాసుదేవరెడ్డి, బత్తుల రామకృష్ణ, గుండాల వెంకటేష్, కల్లి పిచ్చిరెడ్డి, బొజ్జ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్ సంచార పశుఆరోగ్య సేవ అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

గణపవరం రామాలయాన్ని సందర్శించిన కూర్మానాథస్వామి

- మే నెలలో ఆలయ ప్రతిష్ట మహోత్సవానికి ఏర్పాట్లు
- హాజరుకానున్న త్రిదండి చిన్నజీయర్ స్వామి



రామాలయ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న కూర్మానాథస్వామి, పక్కన పేర్ని వీరనారాయణ

నాదెండ్ల: హిందూ సంప్రదాయాలకు రామాలయం కేంద్ర బిందువని, రామాలయం లేని ఊరు కానరాదని త్రిదండి చిన్నజీయర్ స్వామి శిష్యుడు, శ్రీమాన్ గుదిమళ్ల కూర్మనాథస్వామి చెప్పారు. గణపవరం గ్రామంలో రూ.2కోట్ల వ్యయంతో పూర్తి రాతి శిలలతో నిర్మిస్తున్న రామాలయాన్ని ఆయన సందర్శించారు. ఆయన నిర్మాణ పనులు తుదిదశకు చేరటంతో ఈ ఏడాది మే నెలలో ప్రతిష్ట చేసేందుకు కమిటీ సభ్యులు సన్నాహాలు చేస్తున్నారు. ప్రతిష్టా మహోత్సవానికి త్రిదండి చిన్నజీయర్ స్వామిని కమిటీ సభ్యులు ఆహ్వానించారు. ఈ క్రమంలో ఆయన శిష్యుడైన కూర్మనాథస్వామి ఆలయాన్ని సందర్శించారు. ఆలయ నిర్మాణంపై సంతృప్తి వ్యక్తం చేసి కమిటీ సభ్యులను అభినందించారు. ఈ ఆలయంలో సీతారాముల వారు, ఆంజనేయ స్వామి, కన్యకా పరమేశ్వరి అమ్మవారి విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు. ధ్వజస్తంభ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. తమిళనాడులోని మహాబలిపురంలో చేయించిన విగ్రహాలు ఇప్పటికే ఆలయానికి చేరాయి. వీటితో పాటూ తిరుమల తిరుపతి దేవస్థానం సహకారంతో పంచలోహ ఉత్సవ విగ్రహాలను సిద్ధం చేయనున్నారు. ఈ నెల 16వ తేదీన చిన్నజీయర్ స్వామి ఇక్కడకు రానున్నారు. ఈ క్రమంలో మే నెలలో ఆయన నిర్ణయించిన తేదీలలో ప్రతిష్టా మహోత్సవం జరగనుంది. ప్రతిష్ఠతో పాటూ యాగశాల స్థల ఏర్పాట్లు పరిశీలించారు. ఆయనతో పాటూ ధనలక్ష్మీ గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ డైరెక్టర్ పేర్ని వీరనారాయణ, రిటైర్డ్ ఎండోమెంట్ స్థపతి రాజేశ్వరాచారి, సేవకుడు శ్రీహరిరావుతో పాటూ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైభవం.. తిరునాళ్ల మహోత్సవం



ప్రత్యేక అలంకరణలో స్వామివారి మూలవిరాట్



కొండ ఎక్కుతున్న భక్తులు

కొండగురునాథ ఆలయానికి పోటెత్తిన భక్తులు

వినుకొండ(నూజెండ్ల): కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారం కొండగురునాథుని తిరునాళ్లకు ఆదివారం భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచే భక్తులు వేలాదిమందిగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఉపవాసం ఉన్న మహిళలు స్వామివారికి పొంగళ్లు సమర్పించారు. పల్నాడు, గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా భక్తులు తరలిరావటంతో తిరునాళ్ల ప్రాంతం కొండ పరిసరాలు భక్తులతో కిక్కిరిసిపోయింది. కొండపైన వెలసిన సంతానలింగేశ్వరుడు, నాగేంద్రస్వామి, శివాలయాల్లో భక్తులు పూజలు చేశారు. తిరునాళ్ల సందర్భంగా 12 భారీ విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఐనవోలు ఎస్‌ఐ అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

అన్నదాన కార్యక్రమాలు...

తిరునాళ్ల సందర్భంగా భక్తులసౌకర్యార్థం అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కాపుసేవాసమితి, శాలివాహన, యాదవ, రెడ్డి , విశ్వబ్రాహ్మణ, ఆర్యవైశ్య, వడియరాజుల సేవాసంఘాలు భక్తులకు అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. తిరునాళ్లను పురస్కరించుకొని కొండగురునాథుని స్వామి వారిని వైఎస్సార్ సీపీ యువనాయకుడు బొల్లా గిరిబాబు దర్శించుకొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు ఘన స్వాగతం పలికి శాలువాలతో సత్కరించారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

చిలకలూరిపేటటౌన్: రోడ్డు ప్రమాదంలో యువకుడు గాయపడిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. 108 సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం యడ్లపాడు మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన బిరుదు మస్తాన్ ద్విచక్రవాహనంపై చిలకలూరిపేట వైపునకు వస్తున్నాడు. ఈక్రమంలో ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ట్రాఫిక్ నియంత్రణ కోసం ఏర్పాటు చేసిన బోర్డు ను ఢీకొట్టి కింద పడిపోయాడు. ప్రమాదంలో తీవ్రగాయాలైన బాధితుడ్ని చిలకలూరిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించి, అనంతరం మెరుగైన చికిత్స కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు.

ద్విచక్ర వాహనాలను దగ్ధం చేసిన దుండగులు

నరసరావుపేట టౌన్: ఇంటి ముందు నిలిపిన వాహనాలను గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు అంటించిన సంఘటన ఆదివారం వెలుగు చూసింది. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోటప్పకొండ రోడ్డు సాంబశివరావుపేటలో నివాసం ఉంటున్న షేక్ చాంద్‌బాషా రోజూ మాదిరిగానే తన ద్విచక్ర వాహనాన్ని శనివారం రాత్రి ఇంటి ముందు నిలిపాడు. ఆదివారం ఉదయం లేచి చూసే సరికి వాహనం దగ్ధమై కనిపించింది. అదే విధంగా పక్క వీధిలో ఇంటి ఎదుట పార్క్ చేసిఉన్న పసుపులేటి చంద్రశేఖర్‌కు చెందిన వాహనానికి దుండగులు నిప్పు అంటించారు. సమాచారం అందుకున్న సీఐ వీరేంద్రబాబు సంఘటనా స్థలానికి చేరుకొని దగ్ధమైన రెండు ద్విచక్రవాహనాలను పరిశీలించారు. సమీపంలోని సీసీ ఫుటేజ్‌లో నిక్షిప్తమై ఉన్న వీడియోను పరిశీలించి అనుమానితులను గుర్తించారు. ఈ మేరకు బాధితులు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఓంకారేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం

నాదెండ్ల: ఎండుగుంపాలెం గ్రామంలో కొలువైయున్న గంగాపార్వతి సమేత ఓంకారేశ్వర స్వామి దేవాలయ 21 వార్షికోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివార్లను ఉదయం ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. గోత్రనామ అభిషేకాలు చేశారు. శాంతిహోమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. స్వామివార్లకు ఘనంగా కళ్యాణం జరిపి గ్రామోత్సవం నిర్వహించారు.ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రావెళ్ల సత్యలక్ష్మీ నృసింహ భాస్కరుడు, పాలక మండలి అధ్యక్షుడు కందుల అంకమ్మ, కమిటీ సభ్యులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

నేడు ఉద్యోగ సంఘాల చర్చావేదిక

నరసరావుపేట ఈస్ట్: ప్రకాష్‌నగర్‌లోని భువనచంద్రటౌన్‌హాల్‌లో ఈ నెల 6వ తేదీ సోమవారం సాయంత్రం ప్రభుత్వ ఉద్యోగుల సంఘాల చర్చావేదికను నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు స్వర్ణా చినరామిరెడ్డి, కార్యదర్శి ఎస్.రవి ఆదివారం తెలిపారు. ఉద్యోగులు–జీతభత్యాలు–చట్టబద్దతా మార్గదర్శకాలతో ఈ చర్చావేదిక ఉంటుందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

దూరప్రాంతాలకు వెళ్లి పింఛన్ అందజేత



హైదరాబాద్ ఒమేగా హాస్పిటల్‌లో లబ్ధిదారుడికి పింఛన్ అందజేస్తున్న వలంటీరు నసీమా

నరసరావుపేట: స్థానిక పింఛన్‌దారులు ఇద్దరు హైదరాబాదు, మంగళగిరిలలో చికిత్స పొందుతూ ఉండగా వలంటీర్, సచివాలయ ఉద్యోగి అక్కడకు వెళ్లి పింఛన్ అందజేశారు. 34వ వార్డుకు చెందిన పింఛన్‌దారుడు అంకాల తిరుపతిరావు అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఒమేగా హాస్పిటల్‌లో చికిత్సపొందుతుండగా 33వ సచివాలయం ఇందిరానగర్‌కు చెందిన సయ్యద్ నసీమా 300కిలోమీటర్ల దూరం ప్రయాణించి పింఛన్ అందజేశారు. అలాగే ఎన్‌ఆర్‌ఐ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 25వ వార్డుకు చెందిన తన్నీరు సుబ్బారావుకు సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీ పి.ఝాన్సీబాయి పింఛన్ అందజేశారు. వారికి రోగుల బంధువులు కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా విగ్రహాల ప్రతిష్ట



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న బొల్లా గిరిబాబు

వినుకొండ(నూజెండ్ల): మండలంలోని కొండ్రప్రోలు గ్రామంలో పోలేరమ్మ తల్లి, పోతురాజు స్వామి వారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ యువనాయకుడు బొల్లా గిరిబాబు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సత్కరించారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

- పట్టణంలోని పాత మార్కెట్ బజారులో గల శివాలయం పక్కన వేంచేసి ఉన్న చలివేంద్ర ఆంజనేయస్వామి దేవస్థాన పునఃప్రతిష్ఠ మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ఆదివారం విఘ్నేశ్వర పూజ, పుణ్యవచనం, వాస్తు మండపారాధన, వాస్తు హోమాలు, అంకురారోపణ, స్వామివారికి నీరాజనం పూజలు నిర్వహించారు. ఈ నెల 9వ తేదీవరకు వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. చివరి రోజు యంత్రస్థాపన, విగ్రహాల ప్రతిష్ఠ, శిఖర ప్రతిష్ఠ జరుగుతుందని వివరించారు.

వైభవంగా కల్యాణ వేడుకలు



పోట్లూరులో కల్యాణ వేడుకల్లో పాల్గొన్న దంపతులు

శావల్యాపురం: మండలంలోని గుర్రంవారిపాలెం, వేల్పూరు, పోట్లూరు గ్రామపంచాయతీ పరిధిలో ఏబీసీ కెనాల్ వద్ద వేంచేసియున్న గోపయ్య సమేత లక్ష్మీ తిరుపతమ్మ కల్యాణం వేడుకులు ఆదివారం అత్యంత భక్తిశ్రద్దలతో భక్తులు నిర్వహించారు. ఆలయ పూజారి శ్రీనివాసరావు సారథ్యంలో విశేష పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా గోపయ్య సమేత లక్ష్మీతిరుపతమ్మ అమ్మవారికి ప్రత్యేకంగా పట్టువస్త్రాలు పూలమాలలతో అలంకరణ చేశారు. దేవాలయ ప్రాంగణంలో ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేకంగా అలంకరణ చేసి వేదపండితులు వేదమంత్రాలు భజంత్రీలు నడుమ దంపతులచే కల్యాణ వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త గోనుగుంట్ల వెంకటరావు, కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో భారీ అన్నదానం చేపట్టారు. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. దేవాలయాన్ని విద్యుత్ కాంతులతో ముస్తాబు చేశారు.

చేతిరాతపై ఉపాధ్యాయులకు శిక్షణ



రామ్మోహనరావును సన్మానిస్తున్న ట్రస్ట్ సభ్యులు, ఉపాధ్యాయులు

వినుకొండ(నూజెండ్ల): బెజవాడ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అందమైన చేతిరాత ఒక్కరోజులో అనే కార్యక్రమాన్ని స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ ఉపాధ్యాయులకు నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వి.రామ్మోహనరావు ఉపాధ్యాయులకు చేతిరాత నైపుణ్యం పెంపొందించుకునేందుకు సూచనలు చేశారు. ఉపాధ్యాయులు, పిల్లలు ఎక్కువగా రాయటం అలవాటు చేసుకుంటే చేతిరాతలో మరింత నైపుణ్యం పెరుగుతుందన్నారు. మొత్తం 70మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు ఈ శిక్షణలో పాల్గొన్నారు. అనంతరం రామ్మోహనరావును ఘనంగా సత్కరించారు. ట్రస్ట్ అధ్యక్షుడు బీవీ నాగేశ్వరరావు, కౌన్సిలర్ ఎంఎస్‌కే బాషా, గంగవరపు వెంకాయమ్మ, సీహెచ్ రమేష్, ఎస్‌కే సుభాని, పి.నాయక్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ మ్యాచ్‌లో మున్సిపల్ జట్టు విజయం



అర్బన్ సీఐ రాజేశ్వరరావు నుంచి కప్పు అందుకుంటున్న మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు

చిలకలూరిపేట: పురపాలక సంఘం ఆధ్వర్యంలో పురుషోత్తమపట్నంలోని క్రీడా మైదానంలో మున్సిపల్, పోలీసు జట్ల మధ్య ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్‌ను ఆదివారం నిర్వహించారు. ముందుగా టాస్‌గెలిచి మున్సిపల్ జట్టు బ్యాంటింగ్ ఎంచుకుంది. 12 ఓవర్ల మ్యాచ్‌లో మున్సిపల్ జట్టు 66 పరుగులు చేసింది. తర్వాత బ్యాంటింగ్ చేసిన పోలీసు జట్టు 65 పరుగులకు ఆలౌట్ అయ్యింది. దీంతో ఒక పరుగు ఆధిపత్యంతో మున్సిపల్ జట్టు విజయం సాధించింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం పెరుగుతుందని చెప్పారు. భవిష్యత్తులో విద్యార్థులకు వాలీబాల్, ఖోఖో, కబడ్డీ పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. అర్బన్ సీఐ జి.రాజేశ్వరరావు మాట్లాడుతూ ఇలాంటి ఫ్రెండ్లీ క్రీడలతో ప్రభుత్వ ఉద్యోగులకు ఒత్తిడి తగ్గి మెరుగైన పనితీరు చూపే అవకాశం కలుగుతుందని చెప్పారు. పట్టణ ఎస్‌ఐ ఎస్‌కేఎండీ ఫిరోజ్, మున్సిపల్ శానిటరీ ఇన్స్‌పెక్టర్ షేక్ ఇస్మాయిల్, సిబ్బంది పాల్గొన్నారు.

కొట్లాటకు దారితీసిన కోళ్ల వివాదం

ముగ్గురు మహిళలు, బాలికకు గాయాలు

యడ్లపాడు: ఇళ్ల మధ్య కోళ్ల గొడవ కొట్లాటకు దారితీయడంతో ముగ్గురు మహిళలతో పాటు ఓ బాలికకు గాయాలైన సంఘటన యడ్లపాడు మండలం లింగారావుపాలెం గ్రామంలో జరిగింది. బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలోని బీసీ కాలనీకు చెందిన షేక్ అల్లాబీ, ఆదంబీ, మస్తానమ్మకు చెందిన పెంపుడు కోళ్లు పరిసరాలను పాడు చేస్తున్నాయని పక్కంటి వారితో నాలుగు రోజుల కిందట వివాదమైంది. మహిళల మధ్య రాజుకున్న ఈ వివాదాన్ని వారి కుటుంబంలోని మగవాళ్లు సర్ధిచెప్పడంతో సమస్య సద్దుమణిగింది. అయితే శనివారం రాత్రి తిరిగి ఇదే విషయంపై మరోమారు వాదోపవాదాలు చోటుచేసుకున్నాయి. ఈ నేపథ్యంలో ఉంటున్న ఇళ్లకు చెందిన యువకులు తమ అనుచరులు పదిమంది గొడవకు దిగి అల్లాబీ, ఆదంబీ, మస్తానమ్మ ఆమె కుమార్తె లాల్‌బీలపై దాడి చేశారు. ఈ దాడిలో ముగ్గురు మహిళలతో పాటు బాలికకు గాయాలు కావడంతో చిలకలూరిపేట ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం గుంటూరు సమగ్ర ఆస్పత్రికి తరలించారు. దాడిలో సాహిద్, సబీర్, అక్బర్, ఇస్లాం, జలీల్, అన్వర్‌లతో పాటు వారి అనుచరులు ఉన్నట్లు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఘనంగా లక్ష్మీతిరుపతమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం

రొంపిచర్ల: స్థానిక బొడ్రాయి సెంటర్లో వేంచేసియున్న లక్ష్మీ తిరుపతమ్మ తల్లి గోపయ్య స్వామి ఆలయ 23వ వార్షికోత్సవం ఆదివారం నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ లక్ష్మీ తిరుపతమ్మ తల్లి, గోపయ్య స్వామి కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారిని, స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష సహస్రనామ, కుంకుమార్చన, అలంకరణ పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన పలువురు దంపతులు పీటల మీద కూర్చొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి వేడుకల్లో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆడపడుచులు గ్రామంలో తమ పుట్టిళ్లకు రావడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ వేడుకల్లో పాల్గొన్న భక్తులు తమకు తోచిన విధంగా అమ్మవారికి వస్తు, నగదు రూపంలో కానుకలు సమర్పించుకున్నారు. అనంతరం ఆలయ ఆవరణలో భారీ అన్నదానం జరిగింది. సుమారు పదివేల మందికి పైగా అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పిల్లి ఓబుల్‌రెడ్డి, మార్కెట్ యార్డు ఛైర్మన్ పచ్చవ రవీంద్రబాబు, గ్రామ మాజీ సర్పంచులు గెల్లి చినకోటిరెడ్డి, పడాల చక్రారెడ్డి, గెల్లి వెంకటరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల నాయకులు పడాల శివారెడ్డి, అన్నెం పున్నారెడ్డి, మానుకొండ వాసుదేవరెడ్డి, గెల్లి కోటిరెడ్డి, శివారెడ్డి, కల్లి పిచ్చిరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

203 మందికి వైద్యపరీక్షలు

నకరికల్లు: ఉచిత వైద్యశిబిరాల ద్వారా పల్లెల్లోని ప్రజలకు వైద్యసేవలు అందజేయడం అభినందనీయమని మండల ఉపాధ్యక్షుడు మేడం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని నర్సింగపాడులో నరసరావుపేటలోని జీబీఆర్ హాస్పటల్స్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. సుమారు 203 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి మాట్లాడుతూ పల్లెప్రాంతాల్లోని ప్రజలకు ఉచిత సేవలు అందించేందుకు ఉచిత వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా శస్త్రచికిత్సలు తమ వైద్యశాలలో నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ గజ్జల ప్రియాంక, డాక్టర్ సతీష్‌రెడ్డి, డాక్టర్ సుబ్బారెడ్డి, డాక్టర్ శ్రావణి, డాక్టర్ కోటేశ్వరి, కొత్తపల్లి ప్రసాద్, పమ్మి కృష్ణారెడ్డి, షేక్.వలి పాల్గొన్నారు.

రీసర్వే పనులు నూరుశాతం పూర్తి

శావల్యాపురం: మండలంలోని కనమర్లపూడి రెవెన్యూ గ్రామంలో రీసర్వే పనులు నూరు శాతం పూర్తి అయినట్లు తహసీల్దార్ షేక్ జాన్‌సైదులు తెలిపారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ కనమర్లపూడి రెవెన్యూ గ్రామంలో 3539 ఎకరాలు భూములు ఉండగా రైతుల సమక్షంలో ఆధునికీకరణ యంత్ర పరికరాల ద్వారా భూముల కొలతలు, సరిహద్దులను వీఆర్వోలు, గ్రామ సచివాలయ సర్వేయర్లు రీసర్వే పనులు పారదర్శకంగా చేశామన్నారు. శావల్యాపురంలో రికార్డు పనులు 50 శాతం పూర్తి అయినట్లు తెలిపారు. కనమర్లపూడి గ్రామ పంచాయతీ పరిధిలో రికార్డు పనులు నూరుశాతం పూర్తి చేశామని, 1442 ఎల్‌పీఎన్ సర్వే నంబర్లు గుర్తించి ఫామ్ 9 (2) నోటీసులు రైతులకు ఇవ్వటానికి రంగం సిద్ధం చేశామన్నారు. నోటీసులు తీసుకున్న రైతులు ఏమైనా అభ్యంతరాలు ఉంటే 30 రోజుల వ్యవధిలో లిఖిత పూర్వకంగా తెలిపితే మరలా క్షేత్రస్థాయిలో రెవెన్యూ అధికారులు పరిశీలించి విచారణ జరిపి తగుచర్యలు తీసుకుంటామన్నారు. అభ్యంతరం లేని భూములకు సంబంధించి రైతుల సమగ్ర వివరాలు తహసీల్దార్, ఆర్డీఓ, జాయింట్ కలెక్టరు లాగిన్ నమోదు అనంతరం డ్రాఫ్ట్ ల్యాండ్ రికార్డు నమోదు చేసిన రైతులకు భూహక్కు పత్రాలు అందజేస్తామన్నారు. భూహక్కు పత్రాలు పొందిన రైతుల నుంచి వలంటీర్లు ఈకేవైసీ నమోదు చేస్తారన్నారు.

భక్తిశ్రద్ధలతో మాఘపౌర్ణమి పూజలు

సత్తెనపల్లి: పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో లలిత జయంతి, మాఘ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని అమ్మవారికి తులసీ దళాలతో విశేషమైన అలంకరణ చేపట్టి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్య మహిళా సంఘం, లలితా భక్త సమాజం సంయుక్త ఆధ్వర్యంలో ఘనంగా ప్రత్యేక పూజలు చేశారు. 12 గంటల పాటు నిరంతరంగా సప్తాహం, సర్వ మంగళ మాంగల్యే .. అంటూ పారాయణం చేశారు. కల్యాణ మండపంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జవ్వాజి లక్ష్మి, నాళం పార్వతిదేవి, రంగా రమాదేవి, కోట నాగవరలక్ష్మి, చుండురు లక్ష్మి, తునుగుంట్ల నాగ కన్యాకుమారీ, పెరుమాళ్ళ రాజ్యలక్ష్మి తోపాటు అనేకమంది మహిళలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య చలివేంద్ర సంఘం అధ్యక్షుడు శింగరి మధుసూదనరావు, కమిటీ సభ్యులు కార్యక్రమం చేసుకోవడానికి అవకాశం కల్పించినందుకు హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు.అలాగే రైల్వే స్టేషన్ రోడ్‌లోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో, వడ్డవల్లి రామాలయం, వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.